క్లుప్తంగా

బీసీ బంధుతో ఆర్థిక ప్రగతి సాధించాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్

నార్నూర్: ప్రభుత్వం అందిస్తున్న బీసీబంధుతో ఆర్థికప్రగతి సాధించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు రూ. లక్ష సహాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, పాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, ఎంపీడీవో రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఎమ్మెల్సీ దండె విఠల్‌కు బోథ్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గురువారం ఎమ్మెల్సీ దండె విఠల్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌లు డివిజన్ దీక్ష శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ సురేందర్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, తిరుమల్ గౌడ్, సుభాష్, జహీర్, వినయ్, అల్లకొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు నాయకత్వం అప్పగించాలి

గుడిహత్నూర్: రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు నాయకత్వాన్ని అణగారినవర్గాలకు అప్పగించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బడుగు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా పార్టీల దిష్టిబొమ్మను స్థానిక బస్టాండ్ వద్ద దహనం చేశారు. 7 శాతం లేని అగ్రకులాలు పార్టీలకు నాయకత్వం వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా సామాజిక న్యాయ సూత్రానికి, భారత రాజ్యాంగ సమానత్వానికి వ్యతిరేకమన్నారు. నాయకులు జగదీష్, రాజు, రాకేశ్, వేణు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు సహకరించాలి

కైలాస్‌నగర్: పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధత కోసం కాంగ్రెస్ పెద్దలు సహకరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాదిగ అన్నారు. గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాతను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో తొలి అంశమైన ఎస్సీ వర్గీకరణ కోసం సీడబ్ల్యూసీ తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో గణేష్, శ్రీను, సుభాష్, భూమయ్య, మధుకర్, ప్రేమేందర్, శంకర్ పాల్గొన్నారు.

నకిలీ మందులు విక్రయించారని ఆందోళన



ధర్నా చేస్తున్న సాథ్‌నంబర్ గ్రామ రైతులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో నకిలీ పురుగుల మందు విక్రయించారని సాథ్ నంబర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం ఆందోళనకు దిగారు. సాథ్‌నంబర్ గ్రామానికి చెందిన దుదిరాం అనే రైతు రెండు రోజుల క్రితం పురుగుల మందు కొనుగోళ్లు చేసి పత్తికి పిచికారీ చేశాడు. పత్తి ఆకులు ఎండిపోవడంతో గ్రామస్తులతో కలిసి ఆందోళన దిగాడు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింపజేశారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్, జిల్లా కార్యదర్శి వీరయ్య కోరారు. గురువారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ నేటికి చేయలేదన్నారు. గిరిజన ఉపాధ్యాయులను ఏజెన్సీ నుంచి ఏజెన్సీకే కేటాయించాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు.



నేరడిగొండ: బసవన్నలతో రైతులు



తాంసి: ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న బసవన్నలు



తలమడుగు: ఎద్దుకు నైవేద్యం తినిపిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

ఘనంగా పొలాల అమావాస్య

జిల్లా వ్యాప్తంగా పొలాల అమావాస్య పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఎడ్లను అందంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. జైనథ్ మండలంలోని దీపాయిగూడలో ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు ప్రత్యేక పూజలు చేసి, ఎడ్లకు నైవేద్యం సమర్పించారు. పంటలు సమృద్ధిగా పండాలని ప్రజలు మొక్కుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



జైనథ్: ఎడ్లతో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



గుడిహత్నూర్: ఆలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు



నేరడిగొండ: బసవన్నలకు పూజలు చేస్తున్న రైతు కుటుంబం



ఇంద్రవెల్లి: హీరాపూర్‌లో తోరం తెంపుతున్న గ్రామ పటేల్



జైనథ్: ఎడ్లకు నైవేద్యం పెడుతున్న ఎమ్మెల్యే రామన్న దంపతులు



తాంసి: పూజలు చేస్తున్న కుటుంబసభ్యులు



తలమడుగు: హనుమాన్ ఆలయం వద్ద సందడి



ఆదిలాబాద్‌రూరల్: బసవన్నలతో రైతులు



బజార్‌హత్నూర్: ఆలయం చుట్టూ ప్రదక్షిణలు



బోథ్: పూజలు చేస్తున్న మహిళలు



గుడిహత్నూర్: గుడిహత్నూర్ శివాలయం వద్ద..



ఆదిలాబాద్: ఎడ్లకు పూజలు చేస్తున్న ప్రజలు



బేల: చంపెల్లిలో..

ముగిసిన సదస్సు

బోథ్: హైదరాబాద్‌లో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో రాజకీయాల్లో మహిళల రాణింపు, మహిళా సాధికారికత అంశాలపై ఈనెల 12 నుంచి 14వరకు నిర్వహించిన సదస్సు గురువారం ముగిసింది. సదస్సులో ఎన్నో విషయాలు నేర్చుకున్నామని పట్నాపూర్ సర్పంచ్ సుగుణ తెలిపారు.

ఘనంగా సీపీఐ వార్షికోత్సవం

తాంసి: మండలంలోని గోట్కూరి గ్రామంలో సీపీఐ వార్షికోత్సవాన్ని నాయకులు నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద జిల్లా కార్యవర్గ సభ్యుడు చిలుక దేవిదాస్ జెండా ఆవిష్కరించారు. నాయకులు అరుణ్ కుమార్, సట్వాజీ, స్వామి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఖుర్షిద్‌నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ సుబోద్ అన్నారు. గురువారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో పోషణ మాసం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాధ, ఏఎన్ఎం తులసీ, పుష్ప, అరుణ, రుక్మిణి, సునీత, పోచక్క, తదితరులు పాల్గొన్నారు.

కేవైసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు కోసం ఉచిత కేవైసీ నమోదు కేంద్రాన్ని ఉట్నూర్ మండలం మత్తడిగూడ గ్రామంలో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య శ్రీ డిజిటల్ కార్డు పొందాలంటే కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యశోద, కేవైసీ నిర్వాహకులు జుగ్నక గంగాధర్, వినోద్, గ్రామ పటేల్ సిడాం సోనేరావు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



నేరేడుపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డుపై పిచ్చిమొక్కలు

బోథ్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి కొట్టుకుపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కనీసం బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి. గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

‘సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె’

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని అంగన్‌వాడీ, హెల్పేర్ యూనియన్ మండల అధ్యక్షురాలు సుభద్ర అన్నారు. గురువారం నాలుగో రోజు పొలాల అమావాస్య పూజలు చేసి నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆత్రం నాగుబాయి, మెస్రం సుభద్ర, అనిత, సులోచన, దేవుబావు పాల్గొన్నారు.

ఇచ్చోడ: అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. గురువారం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

ఉట్నూర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. పొలాల పండుగ పురస్కరించుకొని ఎడ్లను అలంకరించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సమ్మెలో రత్నమాల, ముక్త, పద్మ, సంగీత, కవిత, లక్ష్మి, స్వర్ణలత పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: పూజలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని సమ్మె శిబిరంలో పొలాల పండుగను అక్కడే జరుపుకొని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. మట్టి ఎడ్లకు పూజలు చేసి ఇప్పటికైనా ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, ఉద్యోగులు మీరాబాయి, సంగీత, లక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.



ఇచ్చోడ: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం పొలాల పండుగ రోజు సైతం వర్షంలోనూ నిరసన తెలిపారు. బసవయ్యలకు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. సీఐటీయూ నాయకురాలు సునీత, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కైలాస్ టెకిడిని సందర్శించిన నాయకులు

బోథ్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కైలాస్ టెకిడి శివాలయాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్, బోథ్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్ గురువారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శివుడి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారని అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ ఎమ్మెల్సీ దండె విఠల్‌తో పాటు అనిల్, జాన్సన్ నాయక్‌లను సత్కరించారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ సురేందర్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, శ్రీధర్ రెడ్డి, సుభాష్, జహీర్, వినయ్ పాల్గొన్నారు.

అనిల్ జాదవ్‌ను కలిసిన జాన్సన్ నాయక్

నేరడిగొండ: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను కలిశారు. గురువారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు తిరుమల గౌడ్, కేదారేశ్వర్ రెడ్డి, గడ్డం లస్మన్న, డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఏలేటి దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

ఆదిలాబాద్: నిరుద్యోగులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో గురువారం నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజల ఆశలను సీఎం కేసీఆర్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా జాప్యం చేస్తుందని మండిపడ్డారు. శాంతియుతంగా దీక్షలు చేస్తున్నా.. అడ్డుకోవడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు.



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి, జోగు రవి, లోక ప్రవీణ్ రెడ్డి, దినేష్ మటోలియా, గంగారెడ్డి, రఘుపతి, వేదవ్యాస్ మయూర్ చంద్ర, రత్నాకర్ రెడ్డి, రాకేశ్ పాల్గొన్నారు.

పశువుల సంచారంపై కఠిన నిర్ణయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రోడ్లపై సంచరించే పశువులపై జిల్లా యంత్రాంగం కఠిన నిర్ణయం తీసుకుంది. పశువులను రోడ్లపై వదలకుండా వాటిని తమ ఆధీనంలో ఉంచుకోవాలని ఇప్పటికే పలుమార్లు యజమానులను హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఇకపై రోడ్లపై సంచరించే పశువులను నిర్మల్ జిల్లాలోని బాసర, భైంసా, సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ గోశాలలకు తరలించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆ గోశాలల నిర్వాహకులతో మాట్లాడారు. రోడ్లపై తిరిగే మూగజీవాలను ఆయా గోశాలలకు తరలించేలా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ శైలజ తెలిపారు. మళ్లీ యజమానులకు అప్పగించే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. పశువుల యజమానులు ఈవిషయాన్ని గుర్తించాలని ఆమె కోరారు.

నిండుకుండలా ‘సాత్నాల’



జైనథ్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో 24 వేల ఎకరాలకు సాగునీరు అందించే సాత్నాల ప్రాజెక్ట్ ప్రస్తుతం నిండుకుండలా కనిపిస్తోంది. 1.24 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం గల సాత్నాలలో ప్రస్తుతం 1.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 286.50 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉండగా.. ప్రస్తుతం 286.00 మీటర్ల ఎత్తులో నీరు ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండి ఉండడంతో రబీకి పంటలకు కూడా దోకా లేదని రైతులు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా హిందీ దివస్

నార్నూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల జాండా బాలికల ఆశ్రమ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ కుమార్ మాట్లాడుతూ.. హిందీ జాతీయ భాషనే కాదు. జాతీయ సమైక్యత కాపాడే భాష. హిందీ భారతీయ గౌరవానికి నిదర్శనమన్నారు. అనంతరం హిందీ అధ్యాపకులు బాలాజీ కాంబలేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకట రమణ, ఉదయ్ కుమార్, సుజాత, పుష్ప, వైష్ణవి, జలందర్, శివ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రూరల్ కేజీబీవీలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ప్రత్యేకాధికారి కవిత మాట్లాడుతూ.. మాతృభాషతో పాటు జాతీయ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్టీలు అర్చన, జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కవిత

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

గుడిహత్నూర్: వినియక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పోలీస్‌స్టేషనులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన, నిమజ్జన వేడుకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కరెంటు తీగలు, జలాశయాల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో ఎస్సై ఇమ్రాన్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రహ్మానంద్, రమేశ్ జాదవ్, అంకతి రవీందర్, మాధవ్ కేంద్రే, వామన్ గిత్తే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్